క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

కూసుమంచి: మండల డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ బదిలీ అయ్యారు. మంగళవారం ఆమెను కల్లూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యాన కల్లూరు తహసీల్‌లో పనిచేస్తున్న డీటీ కిరణ్‌కుమార్ కూసుమంచి నూతన డీటీగా రానున్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా విక్రమ్


విక్రమ్

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం రాష్ట్ర కమిటీలో ఆహ్వానితుడిగా యనమదల విక్రమ్ నియమితులయ్యారని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 12, 13వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఖమ్మం నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న యర్ర శ్రీకాంత్ మృతితో ఖాళీ అయిన స్థానంలో ఆహ్వానితుడిగా ఉన్న కళ్యాణం వెంకటేశ్వరరావును తీసుకోగా, ఆయన స్థానంలో విక్రమ్‌కు అవకాశం కల్పించారని తెలిపారు. కాగా, 1997–2001 వరకు ఎస్ఎఫ్ఐ ఖమ్మం టౌన్ ఉపాధ్యక్షుడిగా, 2002 – 2005 వరకు డీవైఎఫ్ఐ టౌన్ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విక్రమ్ 2005లో పార్టీ టూ టౌన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కమిటీని పాలేరు నియోజకవర్గ స్వేరోస్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పోలెపొంగు వెంకన్న, ఉపాధ్యక్షుడిగా చిపరపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా నకిరికంటి నాగలక్ష్మి, కమిటీ సభ్యులుగా మేఘన, రమ్య, నరేందర్, సంజు, రమేష్, నాగరాజులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు కోండ్రు రామచంద్రు, గాదరి వెంకన్న ఉమా, సాల్మన్‌రాజు, మాగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి శాలువతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు గండు యాదగిరి, షేక్.మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా రోడ్డులోని వి్తన గిడ్డంగి ఆవరణలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో నాణ్యతలో రాజీపడకూడదని సూచించారు. ఫైర్ సేఫ్టీ పనుల్లో లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆతర్వాత గిడ్డంగులో నిల్వలో ఉన్న సన్న బియ్యం స్టాక్‌లను పరిశీలించి, సంబంధిత రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశాక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కవిత తదితరులు ఉన్నారు.

మందుల కొరత తీర్చాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లా కేంద్రాల్లో ఈజేహెచ్ఎస్ ఆధ్వర్యాన మందుల కొరత తీర్చాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ ఉదయ్‌కుమార్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు మంగళవారం హైదరాబాద్‌లో విన్నవించారు. దీనిపై సీఈఓ స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పీఆర్టీఏ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, కందుల వెంకటనరసయ్య, సాధు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎరువులపై అవగాహన

కూసుమంచి: రైతులు నాట్లు వేసేముందు నారు కట్టలను పీఎస్‌బీ ద్రావణంలో ముంచి నాటు వేయటం ద్వారా భాస్వరం ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని ఏఓ వాణి సూచించారు. మంగళవారం మండలంలోని గట్టుసింగారంలో నిర్వహించిన క్షేత్రస్థాయి ప్రదర్శనలో రైతులకు నారు శుద్ధి పద్ధతులను వివరించారు. భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించి మొక్క అందుబాటులోకి వచ్చేలా ద్రావణాన్ని పశువుల ఎరువులో కలిపి వినియోగించవచ్చన్నారు. అనంతరం నానో యూరియా వలన కలిగే ప్రయోజనాలు, వాడే పద్ధతులను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కట్టడికి కసరత్తు..


కోనాయిగూడెంలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

దోమల నివారణకు గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ

- డ్రైడే, ఫ్రైడేలతో ప్రత్యేక కార్యక్రమాలు
- అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- వేధిస్తున్న నిధుల కొరత

నేలకొండపల్లి: దోమల వలన వచ్చే రోగాలు తీవ్ర నష్టాన్ని కల్గిస్తాయి. అది ఒక్కసారి కుడితే డెంగీ, మలేరియా వంటి రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిం వస్తుంది. ప్రస్తుతం వాటి సమయం ఆసన్నమైనందున పాలేరు డివిజన్‌లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో దోమలు నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, సైడ్ డ్రెయిన్లు, ఇతర స్థలాల్లోని నీటి నిల్వలను అన్వేషించి వాటి నివారణకు యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తోంది. కాగా, గ్రామ పంచాయతీలకు నిధుల కొరత వెంటాడుతుండడంతో పారిశుద్ధ్యం పడకేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణ చర్యలలో భాగంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రత్యేక కార్యాచరణ..

సాధారణంగా ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా దోమల కట్టడికి కృషి చేస్తున్నాయి. డ్రైడే, ఫ్రైడే పేరుతో ఆరోగ్య శాఖ ప్రతీ శుక్రవారం కార్యక్రమం నిర్వహించి జీపీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి గంబుషియా చేప పిల్లలు వదులుతున్నారు. ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాల్లో ఫాగింగ్ ప్రక్రియ కొనసాగుతోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి తలుపులకు తెరలు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- నీరు నిల్వ లేకుండా చూడాలి.
- డ్రమ్ములు, సంపులపై మూతలు ఉంచాలి
- చర్మానికి రక్షణగా మాయిశ్చరైజ్ క్రీములు వాడాలి.
- వారానికో సారైనా ఇంట్లో డ్రైడే పాటించాలి.
- జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.


వర్షపు నీటిని తొలగిస్తున్న దృశ్యం

చర్యలు తీసుకుంటున్నాం..



దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఫాగింగ్ చేయిస్తున్నాం. పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. నీరు నిల్వ లేకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

అవగాహన కల్పించాలి..



దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి

– అడపాల రామారావు, అమ్మగూడెం

నిధులు కేటాయించాలి..



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. నిధుల లేమితో పారిశుద్ధ్యం పడకేసే అవకాశమున్నందున నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

– రచ్చా నరసింహారావు, మాజీ ఎంపీపీ

బీసీ డిక్లరేషన్ చట్టబద్ధతకు ఉద్యమాలు


నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ బీసీ నాయకులతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో బీసీపీఎఫ్(వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక) ఆధ్వర్యాన చేపట్టిన ధర్నాలో నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు మాజీ మంత్రి పువ్వాడను ఆయన నివాసంలో కలవగా వివిధ అంశాలపై మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను నెరవేర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ, డీసీసీబీ, మార్కెట్, సుడా మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, శీలంశెట్టి వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రంలతో పాటు వెంకన్న, షకీనా, భద్రయ్య, అప్పారావు, రమేష్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు


తిరుమలాయపాలెం: మహాధర్నాకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు బీసీ నాయకులు మంగళవారం హైదరాబాద్ తరలివెళ్లారు. తిరుమలాయపాలెం నుంచి పార్టీ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, మాజీ ఎంపీపీ ఎ.ఆంజనేయులు, చామకూరి రాజు, కొత్త వెంకన్న, బండారు ఉపేందర్, సత్యం, భద్రం, చంద్రశేఖర్, వీరన్న తదితరులు తరలివెళ్లగా.. నేలకొండపల్లి నుంచి బీఆర్ఎస్ బీసీ విభాగం జిల్లా నాయకుడు తెల్లగొర్ల లింగస్వామి, బీసీ సంఘం నాయకులు దాసరి ఉదయ్, ఖమ్మం కాంతారావు, సాయి, శ్రీనివాసరావు, కె.వెంకటేష్, మౌలాలీ, రేపాకుల సూరయ్య తదితరులు తరలిన వారిలో ఉన్నారు.

అరుదైన వ్యాధులపై అవగాహన కల్పించాలి


రామయ్య ముత్యాలను సత్కరిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం లీగల్: అరుదైన వ్యాధుల ప్రాబల్యంపై అవగాహన పెంచడంలో లీగల్ ప్రొఫెషనల్స్ పాత్ర కీలకమని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజస్, యూఎస్ఏ సీఈఓ ప్రొఫెసర్ డాక్టర్ రామయ్య ముత్యాల అన్నారు. మంగళవారం ఖమ్మం కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో 'రేర్ డిసీజెస్ –రోల్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్'అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అరుదైన వ్యాధుల నివారణకు ఓదార్పు, గౌరవాన్ని ఇచ్చేలా వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన ప్రొఫెసర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు విజయశాంత, కోశాధికారి నరసింహారావు, సభ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, దిరిశాల కష్టారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చినందుకే వేధింపులు..

ఖమ్మంఅర్బన్: అక్రమ నిర్మాణాలను కూల్చినందుకు కొంతమంది వ్యక్తులు తనపై కక్ష కట్టి వేధిస్తున్నారని స్థానిక నివాసితుడు కొర్లకంటి అశోక్ ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం విలేకరులతో తన గోడును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్ 7లో స్థలాన్ని ఆక్రమించిన కొంతమంది వ్యక్తులు స్థానిక నివాసి అశోక్ ఇంటి ప్రహరీకి అనుకుని మరుగుదొడ్డి నిర్మించారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు అందగా.. వారు అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసి అనంతరం వాటిని కూల్చివేశారు. అప్పటి నుంచి తనను వేధిస్తున్నారని, కొందరు మహిళల ద్వారా ఇంట్లోకి ప్రవేశించి దాడికి యత్నించారని దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోయాడు. తనకు ప్రాణహాని ఉందని, దాడికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

గోదావరి జలాలు తరలించడం అన్యాయం

కామేపల్లి : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు చెందాల్సిన గోదావరి జలాలను సత్తుపల్లికి తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుగుదేశం లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు అన్నారు. మంగళవారం కామేపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు కట్టిన ప్రాంతం నుంచి కాలువతవ్వి జూలూరుపాడు వరకు నీళ్లు ఇవ్వకుండా ఇప్పటికే సాగర్ కాలువ ఉన్న ప్రాంతానికి సీతారామ నీళ్లు తీసుకుపోవడం అంటే గిరిజన ప్రాంత ప్రజల హక్కులను దోచుకోవడమే అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేస్తున్న ఈ దుర్మార్గాన్ని ఆపి నీటి వసతి లేని ప్రాంతాలకు తరలించే విధంగా పోరాడతామని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఐద్వా జిల్లా కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల జిల్లావ్యాప్తంగా ఆస్పత్రుల్లో పరిశీలన ద్వారా తేలిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సరిపడా పడకలు సమకూర్చడమే కాక వైద్యులు, సిబ్బంది కొరత తీర్చాలని, శిథిల భవనాల స్థానంలో కొత్తవి మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మతో పాటు మెహరున్నీసాబేగం, బాగం అజిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని పుట్టకోట ఫీడర్‌లో మరమ్మతులు, లైన్ కింద చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నేపథ్యానేడు(బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రఘునాథపాలెం విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్ తెలిపారు. దీంతో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు బాలపేట పరిధిలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జానీమియా

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 19, 20 తేదీల్లో మధిరలో జరగనున్న సీపీఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె.జానీమియా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలపై దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు మహ్మద్ సలాం, బీజీ క్లైమెంట్, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాస్, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, నూనె శశిధర్, పీట్ల కృష్ణమూర్తి, నానబాల రామకృష్ణ, బోడా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుతాం..


కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుమలాయపాలెం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైన మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులందరూ విద్యారంగ సమస్యలపై పోరాడాలని తెలిపారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పిండిప్రోలు కళాశాలలో హాస్టల్ ఏర్పాటుతో పాటు బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మౌలానా ఆజాద్, ఉపాధ్యక్షుడిగా లోకేష్, కార్యదర్శిగా చరణ్, సహాయ కార్యదర్శిగా రామ్‌చరణ్, గర్ల్స్ కన్వీనర్‌గా చరణ్య, కో కన్వీనర్‌గా భార్గవితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గాదె వరుణ్‌కుమార్, జిల్లా నాయకులు హరీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే 'ఇందిరమ్మ' ఇళ్లు ఇవ్వాలి


నేలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బి.రమేష్ , నేలకొండపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో జరిగిన సమావేశంలో రమేష్, నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరులో జరిగిన సమావేశంలో సుధాకర్‌లు మాట్లాడారు. అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ చేసి పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందించాలని కోరారు. అదే విధంగా రూరల్ మండల కార్యాలయాలన్నీ ఒకేచోట తరుణీహాట్‌లో ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయనున్నట్లు సుధాకర్ తెలిపారు. వరంగల్ క్రాస్‌రోడ్డులో జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, కొప్పుల ఉపేందర్, పి.సంగయ్య, పి.మోహన్‌రావు, మెరబోయిన పుల్లయ్య, కుమ్మరికుంట్ల శ్రీను, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొనగా.. కొత్తకొత్తూరులో జరిగిన సమావేశంలో జిల్లా నాయకుడు కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, నాయకులు జ్ఞానరత్నం, హర్షవర్ధన్, కొండలు, వెంకటరమణ, రమేష్, నాగేశ్వరరావు, శేషగిరి, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ


నవీనకు ల్యాప్‌టాప్ అందిస్తున్న ఎస్ఆర్ఐ బాధ్యులు

కూసుమంచి: బీటెక్ విద్యార్థినికి డిస్ట్రిక్ ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం ల్యాప్‌టాప్ అందజేశారు. మండలంలోని జక్కేపల్లి గ్రామానికి చెందిన జడం నవీన కోదాడలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఆమెకు తల్లిదండ్రులు లేకపోవడతో మేనమామ సహకారంతో విద్యనభ్యసిస్తుంది. ఈనేపథ్యాన స్థానికులు ఆమె పరిస్థితిని ఫౌండేషన్ బాధ్యులైన హట్యాతండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తీర్థాల శ్రీదేవి, లెనిన్ దృష్టికి తీసుకురాగా వారు ట్యాప్‌టాప్ కొని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా


ధర్నా చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు పీఆర్సీ అమలుచేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స కల్పించాలని, బస్, రైల్వే, విమాన చార్జీల్లో రాయితీ కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ అనుదీప్‌కు అందజేశారు. గోపీచంద్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో మోదుగు వేలాద్రి, మల్లికార్జునరావు, శ్రీరాములు, రంజాన్, ఝూన్సీ, రాములమ్మ, మధు, భాస్కరరావు, అంజయ్య, శ్రీధర్, గణపతి, కృష్ణారావు, ఉమేష్, ఉమాదేవి, భారతి, సూర్యనారాయణ, రామారావు, కస్తూరి, రామకృష్ణ, ప్రకాశరావు, రామయ్య, రమణ, వెంకటపిచ్చయ్య, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

● కొనసాగుతున్న వంద రోజుల కార్యక్రమం

ఖమ్మంమయూరిసెంటర్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం 44వ డివిజన్ పెవిలియన్ మైదానంలో పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగరంలోని పలు డివిజన్లలో గ్యాంగ్ వర్కర్లతో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

● అభివృద్ధి పనుల పరిశీలన..

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. షాదిఖానాను ఈఈ కృష్ణాలాల్, 55వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు డీఈఈ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

● డివైడర్లలో మొక్కల పరిశీలన..


మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానాధికారిణి రాధిక

నగరంలోని వైరా రోడ్డు డివైడర్లలో నాటిన మొక్కలను కేఎంసీ ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక పరిశీలించారు. నగర సుందరీకరణలో డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు కీలకమని, మొక్కలు లేని స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో ఇష్టారాజ్యం

ప్రమాదాలు జరుగుతాయని జనం ఆందోళన


డ్రెయిన్‌ను ఆనుకుని తక్కువ లోతుతో తీసిన గుంత


నాణ్యత లేకుండా నిలబెట్టిన స్తంభం

ఖమ్మంఅర్బన్: పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా చేసే పనుల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఉన్నా అధికారుల పట్టింపులేని తనంతో నాణ్యత లోపిస్తోంది. ఖమ్మం రోటరీనగర్‌లో జనావాసాల మధ్య విద్యుత్ స్తంభాల ఏర్పాటులో ఇలాగే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఓ భవనానికి లైన్ మంజూరు చేసిన విద్యుత్ శాఖ.. స్తంభాల ఏర్పాటు, లైన్ వేసే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే సదరు కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకపోయినా.. ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తక్కువ లోతుతో గొయ్యి తవ్వి, కనీసం కాంక్రీట్ మిశ్రమం లేకుండానే స్తంభాలు ఏర్పాటు చేయించారు. పైగా స్తంభం పక్కనే డ్రెయినేజీ ఉండడంతో ఎప్పుడైనా ఒరిగి అవకాశముందని చెబుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. కాగా, స్థానికులు ఈ అంశాన్ని ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపిస్తామని తెలిపారు.